# జవాబు

**ఆ**ఫీసు నుండి సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి వచ్చిన గంగాధరంకు గడప దగ్గరే, నాలుగేళ్ల ఏకైక సుపుత్రుడు. అందునా ఇద్దరాడపిల్లల తర్వాత పుట్టినవాడు. ఎదురై భోరున ఏడుస్తూ కాళ్ళను వాటేసుకున్నాడు.

ఆ ఏడ్పుకు గుండె కరగడమంటూ వుంటే గంగాధరం గుండె కరిగిన మాట నిజం. అతనికి రోజుకు రెండు మూడుసార్లయినా తన ఒక్కగానొక్క కొడుకు కారణంగా గుండె కరగుతూనే వుంటుంది.

"నా తండ్రీ! నా బుజ్జీ" అంటూ వాణ్ణి వెంటనే ఎత్తుకొని "యాట్రా ఏడుస్తా వుండావ్" అని అడిగాడు. వాడు అతనికి ఆరో ప్రాణం. మిగతా ఐదు ప్రాణాల సంగతీ నిజంగా అతడికి తెలీదు.

"అమ్మ కొత్తింది" అన్నాడు వాడు ఏడుపును మరింత పెంచే ప్రయత్నం చేస్తూ... "అమ్మ కొట్టును" అన్నది వాని సిద్ధాంతం.... వాని సిద్ధాంతాన్ని మరింత సాగదీస్తే నాన్న ఎప్పుడూ కొట్టడు అన్నది కూడా అందులో భాగమే.

గంగాధరానికి బాగా కోపం వచ్చింది. కాఫీ చికాకు సంగతలా వుంచి తన వంశోద్ధారకుని వంటి మీద దెబ్బా! ఆ కొట్టింది కూడా వాణ్ని కేవలం కన్న యంత్రమాయె!

నేరుగా వంటింటి గడప దగ్గరకు వెళ్ళి లోపల భార్య వుందా లేదా అని కూడా గమనించకుండా (వుండక ఎక్కడ ఛస్తుంది) "బాబును కొట్టావంటనే మల్లా ఏం రోగమొచ్చింది" అనడిగాడు చాలా తీవ్రంగానే.

లోపల వున్న భార్య అతని ముఖంలోకి చూసి "బాబుని కొట్టక నిన్ను కొట్టమంటావా?" అని అందామనుకొని ఆపుకొని తన పనిలో మునిగిపోయింది.

తనేదన్నా అంటే సమాధానం రాకపోతే (ఒక్క భార్య విషయం లోనే) గంగ వెర్రులెత్తుతుంది, గంగాధరానికి. "నీకే చెప్పేది" అన్నాడు గద్దిస్తూ.

అప్పటికీ ఆమె మాట్లాడలేదు. సమాధాన మివ్వదగిన ప్రశ్నలా ఆమెకది అనిపించలేదు.... ఒకపూట ప్రశ్న ఒకనాటి ప్రశ్న అయితే గదా! రోజూ వుండేదే! తను వాణ్ణి కొట్టడమూ వాడేడ్వడమూ, ఈ పెద్దమనిషి గద్దించటమూ.....

గంగాధరం గట్టిగా జుట్టు పీక్కోవాలనుకున్నాడు. తన జుట్టు కాక పోతే భార్య జుట్టయినా. కానీ ఈ మధ్య భార్య జుట్టు మరీ పొట్టిదై పోయింది. ఆమె జుట్టు పొట్టి గావడానికి కారణాలు కనుక్కోమని ఒక కమిటీని వేస్తే నిస్సందేహంగా దోషి స్థానంలో గంగాధరమే నిలబడతాడు.

"మనిషైనాక బుద్ధుండాలి! చీటికి మాటికీ పసిపిల్లవాణ్ని కొట్టడానికి నీవి చేతులైతే గదా.... " గంగాధరం వంటింటి గడపలో నిల్చొని వాగుతూనే వున్నాడు.

"నీది నోరైతే గదా.... " గొణుక్కుంది పొయ్యిలో కట్టెలు ఎగదోస్తూ ఆవిడ.

లోపలకు నాలుగడుగులు వేశాడు గంగాధరం. ఆమె అతని రాకను గుర్తించనట్టే పొయ్యి వూదటంలో మునిగిపోయింది. పొయ్యిలోని ఎర్రని మంటలు ఆమె ముఖం మీదనీడల్లా పారాడుతున్నాయి. ముక్కు మీదున్న పాత ఎర్రటి పుడక మరింత ఎర్రగా క్షణకాలం మెరిసింది.

ఆమె మౌనం, నిర్లిప్తత, గంగాధరం భరించలేక పోతున్నాడు, కనీసం భయపడ్డట్టు కూడా ఆమె ముఖం పెట్టలేదాయె. ఇది మరీ అవమానంగా వుంది. ఆమె నోటినుండి ఏదో కక్కిస్తే తప్ప అతని ప్రాణం కుదుట పడేట్టు లేదు.

"నీ యవ్వారం చూస్తుంటే వాన్ని బతక నిచ్చేటట్టు లేవు" చాలా గట్టిగానే గదమాయించాడు.

"నువ్వు మాత్రం నన్ను బతకనిచ్చేటట్టుండావా" నోటిదాకా వచ్చిన మాటల్ని పెదవుల మధ్యనే ఆపుకొందామె. చేత్తో గరిటె తీసుకొని పొయ్యి మీద పాత్రలో ఒకటి రెండు సార్లు తిప్పింది.

గంగాధరం పిల్లవాణ్ణి కిందకు దింపాడు. వాడు భయం నటిస్తూ తండ్రి మోకాళ్ళ దగ్గరే నిలబడ్డాడు... వాడికి మహ ఉబలాటంగా వుంది.... ఏదో జరుగుతుందని...

గంగాధరం మరో మూడడుగులు ముందుకు వేశాడు. ఆమె తలెత్తి అతని ముఖంలోకి అరక్షణం చూసి మళ్లీ తల దించుకొని పుల్లల్ని పొయ్యిలోకి ఎగదోసేపనిలో వుండిపోయింది.

"కనేదాంట్లో వుండే శ్రద్ధ పిల్లల్ని పెంచే దాంట్లోనూ వుండాలి" అంటూ ఆమెకు చాలా దగ్గరగా వచ్చాడు గంగాధరం.

"నీ యట్టాంటి మొగుడుంటే పెంచినట్టే" పెదవులు కదిలేలా చాలా సన్నగా గొణిగిందామె.

"ఏందే గొణుక్కుంటున్నావు... అసలు పిల్లవాని జోలికి ఎందుకు పోయినావంటే చెప్పకుండా, మూలి మిందేసుకుంటావా" అంటూ సర్రన ఆమె మీదికి వంగి గట్టిగా జుట్టుపట్టుకొని ఇవతలికి ఈడ్చాడు.

వెనక పిల్లవాడు గొల్లుమన్నాడు. ఆ ఊపుకు ఆమె నేల మీద దభీమని పడింది. అయినా నోట మాత్రం మాట రాలేదు.

గంగాధరానికి శివమెత్తింది. వీపు మీద దబదబా నాలుగు గుద్దులు గుద్ది ఆమె కళ్లలోకి రాక్షసంగా చూశాడు.

ఆమె జుట్టంతా చెదరి పోయింది. రెండు గాజులు చిట్లిపోయాయి. నుదుట మీద కుంకుమ చెదిరింది. అలాగే భర్త కళ్లలోకి అసహ్యంగా, ఆక్రోశంగా, దీనంగా చూసింది...

చెంపమీద మళ్ళీ రెండు దెబ్బలు– "చెప్పుముండా – చెప్పు" గంగాధరం పళ్ళు పటపటమన్నాయి. అతడెత్తిన చేతులెత్తినట్లే వున్నాయి.

ఆమె చేతులు పైకడ్డం పెట్టింది. ఆమె పెదవులు కదిలాయి... ఒక్కొక్కమాటే మెల్ల మెల్లగా ఆమె నోటినుండి వచ్చాయి వణుకుతూ.

"నీ కోసం తీసిపెట్టిన కాఫీ వాడు తాగితేనూ...."

**❖ విపుల, జనవరి 1982**